

— మా గోఖలే

వెంట్రుకను చూసినట్టుగా పక్కకుతిరిగి, ఇంకో పది మంది ఆడకూతుళ్లతో వ్యవహారం నడుపుతుంటాడు. నీకు తల తీసేసినంత పనవుతుంది. వాడి కుతిక కొరుకుదా మనిపిస్తుంది నీకు. కాని, దర్జా లొలకపోస్తూ హేండ్ బాగుల్లోంచి డబ్బు తీసి గిరవాటేస్తూ, చీరెలు కొనుక్కుపోతున్న పక్క ఆడ జనాన్ని చూసి, నీ నోటికీ చెయ్యికీ పక్షవాతం వస్తుంది. ఇక్కడ పాలవాడి మీద నీ శక్తి కున్న స్వేచ్ఛ అక్కడ తుస్సుమంటుం దని నువ్వు గుర్తిస్తావు. అది బజారు సభ్యత!" అన్నాడు ప్రభాకరం, నెమ్మదిగా కాఫీ తాగుతూ.

"అడుక్కుతిన్నట్టుంది మీ చచ్చు ధోరణి! కొంపే తగలడుతుంటే మీ మొగుళ్ళు తగలట్టానికి మూళ్ళమేమిటని గణితాలేస్తూ కూర్చుంటే కొంప బుగ్గయి వీథిలో కూర్చుంటాం! మన సంసారం నడక తీరు చూస్తుంటే సంపాదనకు తగ్గట్టుగా సగం బతుకే బతుకుదాం అనటంలో నమ్మకం నా కెనాడో పోయింది. మన పుత్ర రత్నం బిఎస్. ఎస్.సి. చదువుతున్నాడాయెను! వాడి పార్టీలకూ, సినిమాలకూ, పిక్నిక్కులకూ, హోటళ్లకూ మనం డబ్బు సర్దక పోతే వాడు మిమ్మల్ని నన్నూ బజార్న పెట్టేంతటి విద్య సంపాదించాడు! మన చిరంజీవి పిల్ల బి. ఎస్‌సి. లో అడుగు పెట్టింది గదా? దాని టాయిలెట్సూ, డ్రెస్సులూ, జాయ్ రైడ్సూ, సినిమాలూ, పిక్నిక్కుల్లో ఏది లోపించినా తనని కాలేజీ నుండి వెలివేస్తారని కాట్లకుక్కల్లే అరుస్తుంది! మీకు చేతనైతే నాలుగు రాళ్ళెక్కువ సంపాదించి, ఈ సంసారాన్నో దారిని పెట్టండి గాని, ఇంకో రకంగా వేగటం నా వల్ల కాదు." ఝాడించినట్టనేసింది దుర్గ, కాఫీ జుర్రున జుర్రుతూ.

"బుర్ర గజిబిజైన మనిషి చెవి దగ్గర జుర్రున జుర్రుతుంటే వాడి స్థితేమౌతుందో ఎలా చెప్పటం! మజ్జిగా అన్నం అయిదు వేళ్ళా లోపలికి పోనిచ్చి, తాను చించినట్టు జారుకోవటం తగులుతూంటుంది గాని, కాఫీ జారుడేమిటా అని — " అని అంటున్న ప్రభాకరం రెండు తుండేలు వేయబోయిన వాడల్లే, మధ్యలోనే ఆగిపోయాడు.

రేసుకోర్సులో గుర్రాల రౌడు తీసి నట్టు కొడుకు శంకరం ఎమ్. ఎస్‌సి. కూతురు శాంత బి. ఎస్‌సి. ఒకళ్లనొకళ్లు తోసుకుంటూ వచ్చి వంటింటి ద్వారంలో ఇరుక్కు నించున్నారు.

"అమ్మా, నా కాఫీ." అరిచాడు శంకరం.

"అమ్మా, నాక్కూడా కాఫీ." అరిచింది శాంత.

"నాన్నా, ఈ డిసెంబర్లో కాలేజీ వాళ్ళు మాకు నార్తిండియా టూరు పెట్టారు! నాలుగు రోజుల్లో రెండు వందల ఏభై కట్టాలి! విడిగా వెళితే అయిదు వంద లవుతుంది!" అన్నాడు శంకరం ఏక ధాటిగా.

"ఈ వెధవకేం పనిలేదు, నాన్నా. డిసెంబర్లో పట్టుకుండని డాక్టరు సర్టిఫికెట్టు ఒకటి పారేస్తే కాలేజీ వాళ్ళు నోరెత్తరు. నాన్నా, ఎల్లుండి లోపు టెరం ఫీజు రెండు వందలు కట్టాలి. ఇచ్చెయ్. అమ్మా, చిన్న వాళ్ల జయ స్మగుల్లులో డార్కు బ్లూ నైలెక్సు చీరె మార్కెట్టు ధర కన్నా ముప్పై రూపాయలు చౌకగా కొనుక్కుందమ్మా. ప్రెష్‌గా ఎంత బాగుందో నేను చెప్పలేను! రెణెల్లు కిందటే అన్నావు, బ్లూ నైలెక్సు చీర కొనిపెడతానని" అంది శాంత, శంకరానికి [illegible].

"లేదు, నాన్నా టూరు వెళ్ళకపోతే మార్కులు తగ్గిస్తారు. మాటూ, కై కూడా వేసుకు రావాలట. నా క్లాసుమేట్లందరికీ సూట్లున్నాయి. అసలీ శాంతకు దర్జా లెక్కువైనాయి, నాన్నా. ఇప్పటికి నాలుగు నైలెక్సు చీరె లున్నాయి దీనికి. కాలేజీ వాళ్ళు సినిమాస్టార్లల్లే రోజు కో నైలెక్సు చీరె మార్చుకునేం రమ్మనరు" అన్నాడు శంకరం, శాంత కాలు తొక్కుతూ.

"చూడమ్మా, నా కాలెట్టా తొక్కుతున్నాడో! ఆ చచ్చు సినిమా స్టార్లంటేనే నా కసలు డోకు! నా క్లాసుమేట్సు పుస్తకాల మధ్య సినిమా స్టార్ల బొమ్మ లుంటాయి. నా కట్టాంటి వెర్రి వేషాలేం లేవు. ఈ శంకరమే ఆ రాజేష్ ఖన్నా, దేవానంద్ అంటే మూర్ఛపోతాడు, నాన్నా! ఆ చెంపల మీద పిచ్చిక గూళ్ళూ, వెనక గిరజాలూ, వాలిన మీసాలూ, లాల్చీ మీద లతలూ వాడి కదే రామస్మరణ, నాన్నా" అంది శాంత, శంకరాన్నిగిల్లుతూ.

"జానౌను. మన దేశమంతటా ఈ భక్తి పుష్కలంగా తాండవిస్తున్నది. భక్తికి ఋజువు భజన. అందుకే మన దేశ మంతటా స్టార్ల భజన మందిరాలు వెలిసినాయి. మన ప్రభుత్వం పెట్టిన చౌక డిపోల అందులో వెయ్యోవంతు ఉంటేనా! 'దేశమంటే మనుషులోయ్' అన్నాడు పాప మా అప్పారాయ కవి! ఈనే రాయన బతికుంటే అవుర్న సంతోషిస్తాడు మన మనుషుల్ని చూసి.



ఇదిగో, దుర్గా, పిళ్ల సంగతేమిటో నువ్వు కాస్త చూడు. ఆఫీసుకు టైమవుతున్నది, ఇంకా స్నానమే చేయలేదు." తువాలు దులుపుకుంటూ లేచాడు ప్రభాకరం.

"చూసేందు కేముంది? వాళ్లకి కావలసింది ఇస్తే ఇవ్వండి, లేకుంటే మీ వల్ల కాదని చెప్పండి. పెద్ద చదువులు చదవాలని ఆశలుంటే ఇవన్నీ తప్పుతా యేమిటి?" అంది దుర్గ.

"ఔను మరి. వాడి టూరూ, మాటూ, దాని ఫీజూ, నైలెక్సు చీరే అంతా చేరి స్వల్పంగా అయ్యేది ఆరు వందలేగా! ఆ పాలవాడు ఓ అర్ధ రూపాయి ఎక్కువడిగితే ఇందాకణ్నుంచి మనం నాలిక పీక్కుని ఛస్తున్నాం! మనకు ధయ్యాలు, భూతాలు కనుపించనిది ఏ రోజు?" అన్నాడు ప్రభాకరం., మనసులో భగవాన్ని తలుచుకుంటూ.

""'ఇదేం ఖర్మంటా! పుట్టిన బిడ్డలకూ, ఆ బజారు పక్షులకూ ముడి పెట్టుకుంటారటండీ ఎవరైనా? మన ప్రయోజకత్వాలు అడుగంటితే దయ్యాలూ భూతాలేకాదు, బ్రహ్మరాక్షసులు కూడా వెంటపడతాయి!" అనేసింది దుర్గ, కాఫీ గ్లాసుల్ని ఖజేల్మని కింద పెడుతూ.

అమాంతం శంకరం, శాంతల మధ్య మార్గం ఛేదించుకుని, బాత్ రూములోకి దూరి తలుపేసుకున్నాడు ప్రభాకరం.

స్కూటరెక్కి ఆఫీసుకు బయలుదేరి, మెయిన్ బజారు పక్క సిగరెట్ బంకు వద్ద ఓ పాకెట్ స్మోకీలకోసం ఆగాడు ప్రభాకరం.

"ఏం ప్రభాకరం, ఆఫీసుకేనా వెళ్లేది! నిన్ను కలుసుకోవటానికి కొంచెం ఆలస్యం చేశాను." ప్రభాకరం భుజం మీద చెయ్యి వేసి పలకరించాడు బాల్య స్నేహితుడూ, క్లాసుమేటయిన రామేశం.

"ఏం రామేశం, బాగున్నావా? ఏమిటి విశేషం?" అడిగాడు ప్రభాకరం.

"విశేషం ఉండే నీ దగ్గరి కొస్తున్నా. ఇదిగో చూడు, ప్రభాకరం, ఒకపాయింటు వద్ద ప్రారంభమయిన మన జీవితాల్లో నీ జీవితమైనా వచ్చగా ఉందని నేను ముచ్చట పడుతూంటా. శిణ్ణెల్ల నుంచి మా టీచర్లం సమ్మె చేస్తుండటం నీకు తెలియని విషయం కాదనుకుంటా. ఇష్టం లేకపోయినా తప్పలేదు గనక స్నేహభావంతో నిన్నో వంద రూపాయలప్పడుగుతున్నా. నా దురవస్థకు ఎంతో ఆదుకున్న వాడి వవుతావు" అన్నాడు రామేశం, దీనంగా.

"ఇదిగో, రామేశం, నువ్వంటే నాకు స్నేహ గౌరవాలున్నాయి. అవసరంగా వచ్చిన వాడివి నీతో నీకు కుడిఎడంగా ఉన్న నా స్థితి గురించి చెళ్లబోసుకోవటం నా ఉద్దేశ్యం కాదు. టీచరుగా నీకో రెండు వందలు గిట్టవచ్చు. ప్రత్యేక విలేఖరిగా నాకో అయిదు వందలు ముడతాయి. అయితే ఆర్థిక బాధలకు గురవటంలో నీకు నేనేం తీసిపోనని నువ్వు నమ్మవచ్చు. నాకు జీతం అందిన వారానికే అప్పులు మొదలవుతాయి. కాలేజీ చదువుల ఆదేశాల్ని ఇట్టే నాలుగు రోజుల్లో నేను నా కొడుకూ కూతుళ్లకు ఆరు వందలు చదివించకపోతే నాకు మరణ శిక్ష తప్పదని ఇప్పుడే చెవిని వేసుకుని మామూలుకన్న కొంచెం ముందుగానే ఆఫీసుకు బయలుదేరా. ఈ వేళ ప్రాణాల కన్న ఏ వస్తువు విలువైనా పెరిగింది. ఆస్తుల్లేని వాళ్లకు చదువుల ఖరీదు ఎక్కువైతే జీవితా లెట్లా గడుస్తాయి, రామేశం? ఏ గడ్డి కరిచయినా సరే నాలుగు రోజుల్లో ఆరు వందలు పుట్టించకపోతే నా గతి కుక్కల్నక్కలు పడవు! రామేశం, నేను నిజం చెబుతున్నానని నువ్వు నమ్ము" అన్నాడు ప్రభాకరం, బంకులో స్మోకీలకు ఖాతా రాసేసి.

"ప్రభాకరం, నువ్వు బతుకుతూ చచ్చిన వాడివి! నేను ఎప్పుడో చచ్చి బతుకుతున్న వాణ్ణి! కొంచెం భేదం ఉంది, అంతే" అని వెళ్లిపోయాడు రామేశం.

చేతిలో స్మోకీల పాకెట్ వేపు కొంచెం సేపు చూస్తూ నించున్నాడు ప్రభాకరం.

ప్రభాకరం ఆఫీసులోకి అడుగు పెట్టగానే "బాసు నిన్ను వెంటనే రమ్మని కబురు చేశాడు" అన్నాడు శ్రీరామచంద్ర అనే సంపాదకీయ శాఖోద్యోగి, ప్రభాకరానికి తాఖీదు అందజేస్తూ.

"శ్రీరామచంద్రప్రభో! చల్లని వార్త సొంతం అడుగు పెట్టకుండానే చెవిలో పేల్చేశావు! రక్తపు పోటుండి, వంద మెట్లెక్కి రొప్పుకుంటున్న మనిషి గుండెల మీద ఓ తాపు తన్నితే ఆ దీనుని స్థితి ఎలా గిలగిల కొట్టుకుంటుందో నువ్వు ఊహించగలవా, రామచంద్రప్రభో? బాసు పిలుస్తున్నాడంటే మృత్యు కవాటాలు తెరుచుకుని ఆ గదిలోకి పోవటమే నని నీ కెప్పుడైనా తట్టిందా, రామచంద్ర ప్రభో? సరే, వెళ్లొస్తా. మనఃపూర్వకంగా నా శుభం కోరు!" అని బాసు గది వేపు నడిచాడు ప్రభాకరం.

బాసు గది ముందు బాయ్ ఉన్నాడు, బొద్దుగా పులి మీసాలతో. ప్రభాకరాన్ని చూడగానే యంత్రంలాగా చెయ్యెత్తి వారించాడు, కాసేపు ఆగమన్నట్టు. 'ఈ చచ్చు వెధవ నన్ను రోజూ కొత్తగా చూస్తాడేం ఖర్మ?' అనుకున్నాడు ప్రభాకరం, మంత్రం తగిలిన వాడల్లే నిలబడి పోతూ.

కొంచెంసేపు— ఇంకొంచెంసేపు — చాలాసేపు తను అట్లాగే నించున్నాననుకున్నాడు ప్రభాకరం.


బాయ్ లోపలి కెళ్లాడు. తిరిగి వచ్చాడు. కొంచెం ఆగాడు. లైను క్లియరైంది లోపలి కెళ్లమని సంజ్ఞ చేశాడు. ఉలిక్కిపడి గదిలోకి నడిచాడు ప్రభాకరం.

గదిలోకి వెళ్లి నించున్నాడు ప్రభాకరం, కొత్తగా నాటక రంగం మీద కాలు పెడుతున్న నటుడల్లే.

బాసు తల వంచుకుని ఏదో రాసుకుంటున్నాడు. తనను చూశాడా బాసు? ఏమో, ఊహించటం దుర్లభం! అయినా తల వంచుకుని చుట్టూ మూడు వందల డిగ్రీల పరిధిలో ఏం జరుగుతున్నదీ ఇట్టే గ్రహించగల శక్తి బాసు బాబుకుంది! తల ఎత్తడేం? ఘోరమైన సస్పెన్సు! ఎయిర్—కండిషన్డ్ రూము గనక తనకు చెమట పట్టడంలే. బాసు వెనక ఎత్తుగా ఉన్న ఉడెన్ స్క్రీనుకు గాంధీ, నెహ్రూ, టాగూర్, రమణ మహర్షి, అరవిందఘోష్, సాయిబాబా, కంచి కామకోటి పీఠాధిపతి బొమ్మలు వేళ్లాడుతున్నాయి. బాసుకు వాళ్ల పట్ల భక్తి గౌరవా లుండవచ్చు. ఆ వ్యక్తులు చెప్పిన తత్వాలు కొన్ని రకాలైనవి! ఆ రకాల్లో ఏవి బాగా బాసుకు నచ్చినాయో! నచ్చీ నచ్చకపోయినా బహుజనావళినిబట్టి వాళ్ల పట్ల మనం నమ్రతగా ఉండటంలో తప్పేం ఉండదుగా! బాసుకు కవిత్వం గిట్టదే! అక్కడ టాగూరు బొమ్మెందుకూ? 'మన కవిత్వాలు వికారంగా ఉంటాయండీ' అని బాసు డోకొచ్చినట్లు ఓ సారి అనటం తనకు తెలుసు. మన కవిత్వాలంటే ఆంధ్రులవేగాని విశ్వకవివి కాకపోవచ్చుగా!

"ఏం సుధాకరం, ఏమిటి సంగతి?" చటుక్కున అడిగాడు బాసు, తలఎత్తకుండానే.

విశాల విశ్వంలో మైమరిచి విహారి



బెడుతుండటం వింతగా తోచింది ప్రభాకరానికి.

లోపలికి వెళ్ళి దుస్తులు విప్పి, లుంగీ, బనియను, తువాలుతో వరండాలో కొచ్చి కుర్చీలో కూర్చుని స్మోకీ ముట్టించాడు ప్రభాకరం.

"ఏమండీ, ఆ కూర్చున్నది మీరేనా? పిల్లిలాగా లోపలి కొచ్చి గుడ్డలుకూడా మార్చుకున్నారూ? ఇంకా నయం! దొంగవాడొచ్చినా ఇంతేగా! మా ముద్దుల కూతురు వీధి తలుపు బార్లగా తెరిచి చెప్పకుండా పక్కింటి కెక్కడికో షికా రెళ్ళింది. చూశారా దాని అడుక్కు తినే దర్జా? దానికేం కొంప గుండాన పడితే!" అంది దుర్గ, దొడ్లోంచి వచ్చి వాలుతూ.

"కొంచెం ఘాటుగా కాఫీ ఇస్తా వేమిటి?" అడిగాడు ప్రభాకరం.

"కొంచెమేం ఖర్మ, మీ రా పాలవాడికి మొక్కు పెడుతున్నంత కాలం ఓ లీటరు తెమ్మన్నా తెస్తా" అంటూ లోపలి కెళ్ళింది దుర్గ.

ఎంత చేద్దా 'ఇంటివాసన ఇంటి వాసనే' అనుకున్నాడు ప్రభాకరం.

"మీరు నన్ను లక్ష తిట్టినా సరే, మీతోపాటు కూర్చుని కాస్తన్నా కాఫీ తాగంది నా కదో రకం పిచ్చిగా ఉంటుంది" అంటూ రెండు కప్పుల్లో కాఫీ తెచ్చి పక్క కుర్చీలో కూర్చుంది దుర్గ.

"అంతేగాని, నీకు కాఫీ వాపి ఉందని ఒప్పుకోనంటావు" అన్నాడు ప్రభాకరం.

"ఔనౌను! ఇన్నాళ్ళ నుంచీ నేనూ అనుకుంటూంటా, అన్ని గంటలు ఆఫీసులో పనిచేసి వస్తూంటారు గదా ఒకపూటన్నా ఇంటి కొచ్చేప్పటి కో బుద్ధి మారుతుందేమో నని. అయ్యో రామ, అంత అదృష్టంకూడానా! ఔనండీ, పిల్లలకు కావలసిన డబ్బు విషయం కాస్తన్నా పట్టించుకున్నారా? ఆఫీసులో ఎప్పుడడిగి తీసుకోండి, నెలనెలా కాస్త జీతంలో తగ్గించుకుంటారు" అంది దుర్గ.

"అదెంతసేపు పని! 'ఓయ్, కాషియర్ ఆరు వంద లిటు పారెయ్యండీ, మెల్లిగా సర్దుబాటు చేసుకుందురు గాని' అని నే ననటమూ, వెంటనే వాళ్ళింత నోట్లు కట్ట నా చేతిలో పెట్టడమూ క్షణాల్లో జరిగిపోతుందాయేను! నీ ఉద్దేశ్యం, మా ఆఫీసువాళ్ళు మన కేదో వేలు విడిచిన కావలసిన వాళ్ళనీ, వాళ్ళు మన కొచ్చే కష్టాల్ని అవతలికి గిరవాటేసి, మనల్ని ఒళ్ళో కూర్చోపెట్టుకుని ముద్దు లాడుతూ ఇన్ని చాక్లెటు బిళ్ళ లిస్తారని నువ్వు అనుకుంటూ ఉన్నట్టుంది! కాని, వాడుకలో ఉన్న పరిస్థితుల్నిబట్టి అవేం అమల్లో కొచ్చే తెలికైన విషయాలు కావని నేను నీకు గట్టిగా అరిచి చెప్ప వలసి ఉంటుంది. ఈ వేళ ఆఫీసులో నాకు చందనాది తైలమర్దనతో సుఖంగా తలంటి పోశాడు మా బాసు!" అన్నాడు ప్రభాకరం.

"ఇదేం ఖర్మండీ! ఏమైనా తిట్టాడా? మరి మీ రంటే బాసుకు ఇష్టమేగా! ఎప్పుడూ మీతో సరదాగా మాట్లాడు తుంటాడనే వారుకూడా. ఆయనకి గిట్టని పనేమైనా చేశారా ఏమిటి? చప్పుడు కాకుండా వచ్చి ఈ వరండాలో మూల మాట్లాడకుండా కూర్చుంటే ఏదో జరి గుంటుందని అనుమానపడుతూనే ఉన్నా" అంది దుర్గ.

"గిట్టని పనంటే ఆయన చొక్కా పట్టుకు లాగో, బుజం పట్టుకు తోసో చేసుంటాననా నీ ఉద్దేశ్యం? నేను రాసే రిపోర్ట్సు తనకి నచ్చటం లేదనీ, అందుకే రెండు వంద లెక్కు విచ్చి ఇంకోర్ని కొత్తగా పెట్టాననీ నా మొహాన చెప్పాడు బాసు!" అన్నాడు ప్రభాకరం.

"ఎంత అన్యాయం! ఆ మధ్యే గదండీ మీ రంటే మంచి అభిప్రాయం ఉందన్నారు, ఈ వేళం ఇబ్బందీ ఆ మనిషికి? ఉద్యోగంలోంచి తీసేయడు గదా? అప్పుడు మనం ఏం చేస్తామండీ?" అంది దుర్గ, కుర్చీకి అంటుకుపోతూ.

"తీసివేతుడు— వెయ్యలేడుకూడా. కానీ, నే నా ఆఫీసులో తలెత్తుకు తిరగ లేను. ఆ బతు కెట్టాంటిదో నీ కర్థం కాదు" అన్నాడు ప్రభాకరం.

"అర్థం కాకపోతే మునిగి పోయేదేం లేదు లెండి. మీ కా ఇచ్చే అయిదు వందలే మనకు చాలు. గంపెడు మందున్న రెండు కుటుంబాల కా మాత్రమన్నా దక్కక అల్లాట్టం నేను కళ్ళారా చూశా. 'మన ఈ అక్కుపక్కులు టెరిలీన్ డ్రెస్సులనీ, ఫారిన్ నైలెక్సులనీ మిడిసి పట్టిం రేపట్నుంచీ తెగ నరక్కపోతే నా పేరు దుర్గ కాదు!" అంది దుర్గ, ప్రభాకరం చేతిలో కాఫీ కప్పు తీసుకుని తన కప్పుతో పాటు కుర్చీకింద పెడుతూ.

"అసలు మనుషుల తత్వాలకే చీడ పట్టి కుళ్ళు కంపు కొడుతున్నది! అది శుద్ధయేందుకు మనకుకూడా కొంత వాటా ఉంటే బాగుండును" అన్నాడు ప్రభాకరం, స్మోకీ నో గట్టి దమ్ము పీల్చి అవతల గిరవాటేస్తూ.

"అమ్మో, ఏమిటే మీ రిక్కడ చేస్తున్నారూ, వరండాలో లైటన్నా లేకుండా? నాన్నా, శంకరం సినిమా కెళ్దాట్టం. వాళ్ళ రాము చెప్పాడు!" అంది శాంత, వరండాలోకి గంతేసి దూకుతూ.

★

